# తృష్ణ

'నేనెల్లను పనికి..'' రెక్కపుచ్చుకుని లాక్కెళ్తోన్న ముత్యాలమ్మ చేతినుంచి విడిపించుకోవడానికి పెనుగులాడుతూ అన్నది సీత.

'' ఎల్లవెల్లవు. పనికెల్లకుంటే నీకు కూడేడికెల్లివస్తది? నీకు బట్ట లేడికెల్లి వస్తయి.. నడునడు.. నాయనతో సెప్త ఎల్లకుంటె..'' గదమాయిస్తూ సీతని బలవంతంగా లాక్కెళ్ళ సాగింది ముత్యాలమ్మ.

వీధిలోని జనం అంతా చోద్యం చూస్తూ నిలబడ్డారు.

ఒకళ్ళిద్దరు – '' ఎందుకే ముత్యాలూ! బిడ్డని గట్ల కొడ్తున్నవు?'' అంటూ మందలించారు.

''సూడు సుక్కమ్మత్త.. మా అమ్మతాన వుండి పనిచేస్కుని బతకవే ఎదవమొకమా! అంటే పనికెల్లదంట.. పనికెల్లదు..'' మండిపడుతూ సీత నెత్తిన గట్టిగా మొట్టింది.

సీత భోరుమంది. 'నే నెల్ల సుక్కమ్మత్తా.. పనికెల్ల.. నేనిస్కూలికి బోత.. సదువుకుంట.. ఏడుస్తూ చుక్కమ్మని అల్లుకుపోయింది.

''సూసినావే.. సదువుకుంటుందంట.. ఈ మొకానికి సదువొకటి..'' కసిరింది ముత్యాలు సీతని లాగుతూ..

చుక్కమ్మ సీతపట్ల జాలి ప్రదర్శిస్తూ.. అన్నది..

''పోనీరాదే పాపం.. సదూకోనీరాదు..''

'' ఏంది పాపం!'' చిరాగ్గా చూసింది ముత్యాలమ్మ.

''సదూకోడానికి బంగ్లాలోల్లమా ఏంది? బంగ్లాలో వుంటే సదువులు.. పుత్తకాలు.. వస్తాయి.. గయన్నీ మనకేడికెల్లి వస్తయి. అయినా సుక్కమ్మత్తా.. సదువు దీని అయ్యకుందా?.. దీని తాతకుందా?.. దీని అమ్మకుందా?..

అమ్మమ్మకుందా?,, ఆకరికి దీని అన్నలుకూడా ఆవారాగాండ్ల లెక్క తిరుగుతంట్రు. దీని కొత్తదా.. వట్టిగ పైసలు దండుగ. గీపోరీ చెప్పినట్లు ఇనదేంది?.. నేను కూరగాయలిచ్చే బాన్మతమ్మ దినాం అడుగుతాంది.. దీన్ని ఆడనే వుంచేయమని.. టిఫిను.. కాఫీలు.. అన్నం.. బట్టలు.. అన్నీ ఇస్తుందట.. టి.వి. కూడా వున్నది.. మంచిగ సిన్మలు చూడచ్చు.. ఏం రోగవమాయె పోనీకి..''

''నా కయన్నీ ఏమొద్దు.. నాకు ఐదోకిలాసు బుక్కు కొనియ్యి. నేను సదువుకుంట. నాలుగు పాసుకాలే.. ఐదుకూడా పాసయితా..'' ఏడుపాపి గట్టిగా అన్నది సీత..

''పోనిరాదక్క .. సదిపియ్యరాదే.. ఐదోకీలాస సదివనంక పనిలో పెట్టరాదే..'' సలహా ఇచ్చింది సక్కుబాయి.

''లే.. లే.. నేను పదిగూడా పాసైతా.. కాలేజిల సదువుత.. '' తన కోరిక ఆశగా వెల్లడించింది సీత.

''సూసినావే... ఇది ఇంటాది.. వెుుండి వెుుకంది. కాలేజీకి పోతదంట..కాలేజీకి. దీనయ్య తాగి ఏడపండిండో.. గీ మాట ఇంటే చమ్డా తీస్తుండే.. ''ముత్యాలమ్మ సీత మాటలకి రెట్టించిన కోపంతో బరబరా లాక్కెళ్లింది..

సీత రానని మొరాయిస్తూనే వుంది.. ఏడుస్తూనే వుంది.. దాని మొర ఎవరూ ఆలకించలేదు..

ముత్యాలమ్మ వాడుకగా కూరగాయలిచ్చే భానుమతికి చేతికింద ఓపిల్ల కావాల్సివచ్చింది.

అత్తగారు, మావగారు, భర్త, ఇద్దరు పిల్లలు, వీళ్ళందరి సంరక్షణ, ఆలనాపాలనా, పరిచర్యలు వీటి మధ్య ఆవిడకి క్షణం తీరిక వుండదు. వారానికో పనిమనిషి చొప్పున మారుతుండటంతో అంట్లు తోముకోడం. బట్టలు ఉతుక్కోవడం లాంటి పనులన్నీ కూడా ఆవిడే చేసుకోవాల్సి వచ్చింది. దాంతో ఊపిరి సలపని విధంగా పనుల వత్తిడి పెరిగిపోయింది. ఆవిడ బాధ చూసి ముత్యాలమ్మ అడపా, దడపా ఆ పని, ఈ పని చేసి సాయపడుతుంటే అన్నది భానుమతి.

'' ఎవరన్న ఓ చిన్నపిల్ల వుంటే చూసిపెట్టవే ముత్యాలమ్మా.. చేతికింద వుంచుకుని, రెండుపూట్లా భోజనం పెడతాను.. మా శిరీషకి పొట్టి ఐపోయిన గౌన్లవీ ఇస్తుంటాను.''

ఆ మాటతో ముత్యాలమ్మకి, తన గుండెలమీద రగులుతోన్న పొయ్యిలా వున్న సీత గుర్తొచ్చింది. ముత్యాలమ్మకి ఐదుగురు సంతానం.. భర్త తాపీమేస్త్రీ దగ్గర రోజు కూలీకి వెళ్తుంటాడు.. ఓ రోజు పని ఉంటుంది. ఓ రోజుండదు.. వున్ననాడు నాలుగు డబ్బులు చేతుల్లో ఆడతాయి.. ఆ డబ్బులతో తాగేస్తాడు. మగపిల్లలు నలుగురూ దేశదిమ్మర్లే.. అయితే ఏం? అందరూ కూడా వేళకి తిండికి ఇల్లు చేరి, ముత్యాలమ్మని పీక్కుతింటారు. ఇల్లిల్లూ తిరిగి కూరగాయలమ్మి ఆ డబ్బుల్తో ఎలాగో కుటుంబాన్ని లాక్కొస్తున్న ముత్యాలమ్మకి కూతురు సీత గుదిబండలా మారింది.

సీతకి చదువంటే ప్రాణం. చుట్టుప్రక్కల పిల్లలు కొందరు స్కూళ్ళకు వెళ్తుంటే తనూ వెళ్తానని గొడవచేసేది.చిన్నపిల్ల కదా అని దగ్గర్లోనే వున్న గవర్నమెంట్ స్కూల్‌కి పంపించింది కొన్నాళ్ళు. సీత శ్రద్ధగా చదువుకుని నాలుగో క్లాసు పాసైంది. అది అయిదోక్లాసులో చేరతానంటే వల్లకాదంది ముత్యాలు. ఈ విధంగా సీత అన్ని క్లాసులూ చదివేసి కాలేజీకెళ్తానంటుందనీ.. ఆ కాలేజీ చదువుకయే ఖర్చు తను భరించలేనని - దానిని చదువు మాన్పించింది. రెండుపూట్లా తిండికి కరువైన తమ బ్రతుకులకి చదువు ఓ గగనకుసుమంలాంటిదని ముత్యాలమ్మకి తెలుసు. కానీ చదువుకోవాలన్న ధ్యాస తప్ప, మరేబాధ తెలీనీ సీత మాత్రం తను చదువుకుంటానని రోజూ ఏడుపే.. అందుకే..

ఆ ఏడుపు భరించలేని ముత్యాలమ్మకి భానుమతి కోరిన కోరిక తనపాలిట వరంగా పరిణమించింది. అందుకే సీత విలవిల తన్నుకుంటున్నా వినకుండా తీసుకెళ్ళి భానుమతి దగ్గర వదిలేసింది.

అమ్మగారంటే స్వతహాగా భయం, భక్తి కలగడంతో సీత తన దుఃఖాన్ని, నిరాశనీ గుండెల్లోనే దాచుకుని ఆ ఇంట్లో పనికి అలవాటుపడిపోయింది. ఉదయం లేచిన దగ్గర్నించీ బొంగరంలా తిరుగుతూ చలాకీగా పనులు చేస్తోన్న సీత, భానుమతికి ప్రేమపాత్రురాలైంది. ఎలాంటి పరిస్థితుల్లో కూడా సీతని వదలకూడదని నిశ్చయించుకుంది. దాదాపు తన వయసే ఉన్న అమ్మగారి పిల్లలు శిరీష. శ్రీవాత్సవ్ నీటుగా తయారై మడతనలగని యూనిఫామ్,

నిగనిగలాడే షూస్ వేసుకుని వాళ్ళ డాడీతో కారులో స్కూల్‌కి వెళుతుంటే బిక్కమొహం వేసుకుని చూస్తుండడం అలవాటైంది సీతకి.

వాళ్ళు ఇంట్లో గడగడా ఇంగ్లీషులో మాట్లాడేస్తూ టి.వి.లో కార్టూన్ సినిమాలు చూస్తూ అల్లరిచేస్తోంటే అదేవిటో అర్థంకాని సీత తనూ అలా ఇంగ్లీషులో మాట్లాడటానికి నానా అవస్థ పడసాగింది. టి.వి.ల్లో కనిపించే రకరకాల డ్రెస్‌లు వేసుకున్న అమ్మాయిల్లా తనూ తయారవగలదా? అని దిగులుతో రాత్రిళ్ళు నిద్రకూడా దూరమవసాగింది.

అలా తీరని కోరికలతో, ఆరిపోని ఆశలతో రెండుపూట్ల తిండికోసం, ఒళ్ళు దాచుకోవడానికి ఓ గౌనుకోసం భానుమతి ఇంట్లో చాకిరీకి కుదిరిన సీత చూస్తుండగానే పెద్దదైంది. దానితోపాటే చదువుకోవాలన్న కోరికా, చదువుకోలేకపోయానన్న బాధ కూడా పెరిగాయి. శిరీష, శ్రీవాత్సవ్‌లు కూడా పెద్దవాళ్ళయ్యారు. ముత్యాలమ్మ ఓరోజు హఠాత్తుగా కన్నుమూసింది. సీత తండ్రి, అన్నయ్యల జాడే తెలీలేదు.. ఒంటరిగా మిగిలిపోయిన సీతకు భానుమతి ఇల్లే ఆశ్రయమైంది. ఆవిడే ఆధారమైంది. శిరీష చూస్తుండగానే డా॥ శిరీషగా మారింది. శ్రీవాత్సవ్ అమెరికా వెళ్లిపోయాడు. సీత.. సీతగానే మిగిలిపోయింది.

ఓ రోజెందుకో హఠాత్తుగా గుర్తొచ్చింది భానుమతికి.. పదేళ్ల పిల్లగా తన ఇంట్లో అడుగుపెట్టి.. ఈ పదేళ్ళనుంచీ తనే నమ్ముకుని బ్రతుకున్న సీతకి పెళ్లిచేయాలని, ముత్యాలమ్మ ఆఖరి రోజుల్లో కోరిన ఒకే ఒక్క కోరిక కూడా అదే..

తన ఆలోచన భర్తకి చెప్పింది...

వారం తిరక్కుండానే తన ఆఫీసులో ప్యూన్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌కిచ్చి.. ఓ గుళ్ళో సీత పెళ్లి జరిపించడానికి నిశ్చయించాడాయన.

అనుకున్న ప్రకారం సీత పెళ్ళి జరిగిపోయింది.

ఆమె జీవితంలో చెప్పుకోదగిన మార్పు అదొక్కటే..

రోజూ పగలంతా భానుమతింట్లో గడిపినా, రాత్రికి వెంకటేష్ సన్నిధిలో అదంతా మర్చిపోయి హాయిగా వుంటోంది. అతను తనకున్నంతలో భార్యని బాగానే చూసుకుంటున్నాడు. ఆమెకంటూ ఆస్తిపాస్తులు, వస్తువులు సీత

దగ్గర ఏమీ లేవు. ఏడాదికోసారి భానుమతి కొనిచ్చిన కొన్ని బట్టలు.. శిరీష వాడేసిన కొన్ని బట్టలు.. ఓ అద్దం, దువ్వెన.. కాటుకా.. బొట్టుబిళ్ళలు.. ఇవికాక దానికి ప్రాణ సమానమైన ఐదోక్లాసు పుస్తకాలు.

భానుమతిచ్చిన డబ్బుతో ఐదో తరగతి, పుస్తకాలు కొన్నది.. కానీ.. అవి చదివే తీరిక మాత్రం దొరకలేదు..

రోజూ ఖాళీ సమయంలో చదువుకుందామని తీసినా.. అలసిన కళ్ళు నిద్రను ఆహ్వానించేవి.. పదేళ్ళనుంచీ చెక్కుచెదరకుండా వాటికి పాలిథిన్ కవర్లు చించి అట్టలు వేసి దాచుకుంది.

ఏనాటికైనా తను కాలేజీకెళ్తానన్న ఆశ ఒకటి సీత గుండెల్లో అఖండ దీపంలా ఇంకా వెలుగుతూనే వుంది.

సీత వైవాహిక జీవితం సాఫీగా సాగుతోంది.

ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. ప్రభుత్వం వారి నినాదాలు జీర్ణం చేసుకున్న సీత ఆపరేషన్ చేయించుకుంటానంది. కానీ.. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారు. మగపిల్లాడు పుట్టిందాకా ఆపరేషన్ ప్రసక్తి లేదన్నాడు వెంకటేష్. ఫలితంగా మరో రెండేళ్ళకి ఒకే కాన్పులో ఇద్దరు మగపిల్లలు పుట్టారు. వెంకటేషు ఆనందానికి అవధిలేదు.

సీత సంసారం పెద్దదైంది.

కానీ వాళ్ళిద్దరి ఆదాయం మాత్రం అలాగే వుంది.

సీత ఆశ కూడా అలాగే వుంది.

తన విషయంలో నెరవేరని కోరికని పిల్లల విషయంలో ఐనా తీర్చుకోవాలనుకుంది.

కాలం జరుగుతూనే వుంది

పిల్లలు పెద్దవాళ్ళయ్యారు.

ఆడపిల్లల్ని స్కూల్లో వేద్దామంది.. వెంకటేషు వీల్లేదన్నాడు.. తమ ఆదాయంలో మగపిల్లల్ని మాత్రమే చదివించగలం అన్నాడు.

సీత బ్రతిమాలింది... కాలం మారిందన్నది. ఆడపిల్లలు కూడా

చదువుకోడటం అత్యవసరం అన్నది. లేకపోతే వాళ్ళు కూడా నాలాగే పని మనుషులు అవుతారు అన్నది.

వెంకటేషు ససేమిరా అన్నాడు.

సీత ఆశల మేడలు పెళ్లలు-పెళ్లలుగా విరిగాయి. ఆడపిల్లల్ని చదివించలేకపోతున్నానన్న ఆవేదనతో రాత్రిళ్ళు నిద్రపట్టేదికాదు.. తిండి కూడా మానేసి ఆలోచిస్తూ వుండేపోయేది.

అమ్మగారి పిల్లల్లా తనపిల్లలు కూడా అందంగా తయారై స్కూల్‌కెళ్తోంటే చూడాలన్న తహతహ రోజారోజుకీ ఎక్కువ కాసాగింది.

వెంకటేషు మాత్రం మగపిల్లల్ని చదివించడం కోసం.. ఆఫీసు అయిపోయాక ఒకటి రెండు గంటలు రిక్షా అద్దెకు తీసుకుని నడవడం మొదలుపెట్టాడు. గవర్నమెంటు స్కూళ్లలో చదువు సరిగా చెప్పడం లేదని కొడుకుల్ని ప్రైవేట్ స్కూల్లో చేర్చాడు.

ఆడపిల్లలిద్దర్నీ చుట్టపక్కల వున్న ఇళ్ళల్లో పాచిపనికి పంపిస్తే నాలుగు రాళ్లు వస్తాయని అన్నాడు.

సీత మండిపడింది.. తన బొందిలో ప్రాణం వుండగా అలా పంపనంది.

మగపిల్లలు చదువుకుని, ఉద్యోగాలు చేస్తే ముసలితనంలో తల్లిదండ్రుల్ని చూసుకుంటారు.. ఆడపిల్లకి పెళ్లిచేస్తే వెళ్లిపోతుంది. దానికి చదువెందుకు.. ఇద్దరికీ పన్నెండేళ్ళు రాగానే పెళ్లిచేద్దాం'' అన్నాడు.

అంత స్వార్థపు ఆలోచన మంచిది కాదంది సీత..

ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది..

వారం రోజులు గడిచాయి.. సీత కళ్ళల్లో ఆలోచనల తాలూకు తీవ్రత... అలసట.. కనిపెట్టిన భానుమతి అడిగింది.. '' ఏం జరిగిందే అలా ఉన్నావు..?'' అని..

సీత ఆ కాస్త అపాయ్యతకు చలించి పోయింది.

కన్నీరై కరిగిపోయింది.

సీత చెప్పిందంతా విన్న భానుమతి మాన్పడిపోయింది.

ఇంత ఆలోచన.. ఇన్ని కోరికలున్నాయా ఈ మూగ సీతకు అనుకుంది.

తనకు చేతనైన సాయం చేయాలని నిర్ణయించుకుంది.

''వాళ్లకి పుస్తకాలు నేను కొనిస్తాను.. ఎలాగోలా బళ్లోవేయి..'' అన్నది.

సీత పొంగిపోయింది.. ఆమె మనసు ఓ విహంగంలా రెక్కలు సాచుకుంది.

''అమ్మా!.. నాకు ఐదొందలు అప్పు ఇప్పించు.. నేను.. నేను రోజూ సాయంత్రం పూట.. కూరలేస్తాను..'' అన్నది.

సీత స్వాభిమానానికి ముగ్ధురాలైంది భానుమతి.. తక్షణం లోపలికెళ్లి ఐదొందలు తెచ్చి సీత చేతికిచ్చింది.

సీత ఆనందంతో బైటికెళ్లిపోయింది...

బజారుకెళ్లి ఓ వెదురుగంప కొన్నది.

మిగిలిన డబ్బుతో కూరలు కొన్నది.

గంప నెత్తిన పెట్టుకుని ముందుగా భానుమతింటికి వెళ్లింది.

''అమ్మగారూ! బోణీచేయండి..'' అన్నది. భానుమతి ముప్పై రూపాయల కూరగాయలు కొన్నది.

''అమ్మగారూ! ఇయాలనుంచీ సాయంత్రందాకా మీ పని.. సాయంత్రం కూరగాయల పని.. రోజూ నేనే ఇస్త నీకు కూరలు..'' అన్నది సీత.

భానుమతి తృప్తిగా నవ్వి, 'అలాగే కానీ, నీకు శ్రమ అవదుటే.. పైగా ఇంట్లోకూడా పనివుంటుందిగా'' అన్నది.

''మగపిల్లల్ని సదివించుకునేందుకు మా ఆయన ఆఫీసులో పనికాక రిక్షా తొక్కుతుండు.. ఆడపిల్లల్ని సదివించుకునేందుకు.. నేను ఈ పని చేస్తా ఎంత కష్టమైనా.. నా బిడ్డల్ని సదిపిస్త అమ్మా..''

సీత కళ్లల్లో కనిపిస్తోన్న పట్టుదల.. ఆత్మవిశ్వాసం.. చూసిన భానుమతి కళ్ళు చెమర్చాయి..

విశాలాంధ్ర

తేది 14-12-97